క్లుప్తంగా

ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలి



కంకిపాడు: ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని కంకిపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం డి.ఉమాదేవి, సమగ్రశిక్ష కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ బెజవాడ దీప్తి సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల కార్యక్రమాన్ని జెడ్పీ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన అలవాట్లు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ధ్యానం, మైండ్‌ఫుల్‌నెస్ పద్ధతుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య పరిరక్షణపై స్కిట్‌ను రూపొందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగసింధుకు డాక్టరేట్



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సుంకర నాగసింధుకు నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ విభాగంలో ప్రొఫెసర్ ఆర్.సత్యప్రసాద్ పర్యవేక్షణలో ఆమె డిటెక్షన్ ఆఫ్ డెంటల్ క్యావిటీస్ యూజింగ్ మల్టీ లేయర్డ్ డీప్ లర్నింగ్ ఆల్గోరిథిమ్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్ డీకేఈఆర్‌కే రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, సీఎస్‌సీ హెచ్‌వోడీ డాక్టర్ కె.సౌమ్య, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బుడమేరుపై వంతెన నిర్మించండి

- వరద నీరు ప్రవాహానికంటూ కూలగొట్టిన వైనం
- రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- వంతెన వద్ద అనధికారికంగా వెలిసిన డంపింగ్ యార్డు
- నరకం చూస్తున్న పరిసర ప్రాంత ప్రజలు



కూల్చకముందు బుడమేరుపై వంతెన



ఆనవాలు లేకుండా కూల్చేసిన వంతెన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, రైతులు రాకపోకలు సాగించేందుకు బుడమేరు కాలువపై ఉన్న ఒక్కగానొక్క వంతెనను మాయం చేశారు. బుడమేరులో వరద నీరు ప్రవాహానికంటూ అర్థం పర్థం లేని కారణం చూపుతూ శతాబ్దాల నుంచి పలు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతున్న ఈ వంతెనను మూడు నెలల క్రితం రాత్రికి రాత్రి కూల్చేశారు. రైతులు, గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించకుండా కూల్చేయడంతో అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలు నిలిచిపోవడంతో వంతెన అవతలి ప్రాంతవాసులకు, గ్రామానికి మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. గ్రామంలో బుడమేరు కాలువను దాటుకుని వెళ్లడానికి ఈ వంతెన మార్గమే దిక్కు. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, రైతులు బుడమేరు దాటేందుకు ఈ వంతెన మార్గాన్నే అనుసరిస్తారు. గ్రామానికి చెందిన రైతుల పొలాలు బుడమేరు వైపు ఎక్కువగా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పైగా ఈ కాలువ దాటుకుని కొత్తగా నివాసాలు ఏర్పడటంతో వంతెనపై రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వంతెన లేకపోవడంతో ఏ చిన్నపాటి అవసరం వచ్చిన చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కాల్వగట్టు ప్రాంతానికి ప్రాణపాయస్థితిలో అంబులెన్స్ రావాలన్న వీలులేకుండా పోయిందని వాపోతున్నారు.

రాత్రికి రాత్రి కూల్చేసిన వంతెన..

ఇటీవల కురిసిన వర్షాల ఫలితంగా బుడమేరులో వరదనీరు ప్రవాహనికంటూ రాత్రికి రాత్రి వంతెన కూల్చేశారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రైతులు, గ్రామస్తులకు కనీసం తెలియపరచకుండా ఏకపక్ష నిర్ణయంతో ఎన్నో సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్న వంతెనను ఎలా కూల్చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశంపై గ్రామస్తులు, రైతులు అధికారులను ప్రశ్నించడంతో కొత్త వంతెన నిర్మిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారని వాపోతున్నారు. కాలువలో నీరు తగ్గిన ఇప్పటి వరకూ వంతెన నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన చెందుతున్నారు. గుణదల రెండో వంతెన వద్ద కూడా గడ్డర్లు వేయడంతో అటు నుంచి కాల్వగట్టు ప్రాంతానికి వాహనాల ద్వారా రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోతున్నారు. నెల నెల మహిళలు రేషన్, వృద్ధులు పింఛన్లు తెచ్చుకోవడానికి కూడా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని చెబుతున్నారు. వంతెన లేకపోడంతో నిత్యం నరకాన్ని చూస్తున్నామని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



వంతెన వద్ద అనధికార చెత్త డంపింగ్

డంపింగ్‌యార్డ్‌గా మార్చేశారు

కూలగొట్టిన వంతెన ప్రాంతాన్ని పంచాయతీ అధికారులు డంపింగ్ యార్డ్‌గా మార్చేశారని ఈ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని చెత్తనంతటికి తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తుండటంతో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోయాయి. పంచాయతీ చేస్తున్న డంప్‌కు తోడు కాలువలోని వ్యర్థాలను కూడా ఇక్కడే పడేస్తున్నారని పరిసర ప్రాంతవాసులు వాపోతున్నారు. విషసర్పాలు, దోమల విజృంభణ, తీవ్ర దుర్వాసనతో నిత్యం నరకం చూస్తున్న అధికారులకు పట్టడం లేదని తమ బాధలు వ్యక్తబరుస్తున్నారు. ఇప్పటికి పలుమార్లు పంచాయతీ కార్యదర్శి సత్యబాబుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కాల్వగట్టు ప్రాంత వాసులంటే చులకన భావంతోనే ఇక్కడి చెత్త కుప్పలను తొలగించడం లేదంటున్నారు. మేట వేసుకుపోయిన సమస్యలు పరిష్కరించడంలేదని చెప్పారు. తక్షణమే స్పందించి చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమావేశంలో ప్రశ్నించినా స్పందన లేదు



ఇటీవల పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఈ వంతెన లేకపోవడంతో పడుతున్న బాధలను ప్రశ్నించినా ఇప్పటి వరకూ అధికారుల్లో స్పందన లేదు. వంతెనను కూల్చివేయడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన వద్ద రూ.లక్షలు ఖర్చుపెట్టి వేసిన రోడ్డు నిధులు కూడా వృథా అయ్యాయి. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలి.

– మెండె సుధాకర్, 18వ వార్డు సభ్యుడు, రామవరప్పాడు

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయండి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



కంకిపాడు: స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. మండలంలోని దావులూరు గ్రామంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. స్వామిత్వ సర్వే జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి సర్వే తీరుతెన్నులను పరిశీలించారు. సర్వే క్రమంలో నివాసితుల అభ్యంతరాలపై సిబ్బంది ఇస్తున్న వివరణలు విన్నారు. గ్రామ పటం ఆధారంగా సర్వే జరుగుతుందీ? లేనిదీ? తెలుసుకున్నారు.

ఎంపీపీ పాఠశాల తనిఖీ..

అనంతరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వసతులు వివరాలు తెలుసుకున్నారు. ఒకటో తరగతి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంపై ఆరా తీశారు. ప్రైవేటు పాఠశాలల ప్రభావం కారణంగా ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపుతున్నారని ఉపాధ్యాయులు, స్థానికులు వివరించారు. ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్, తహసీల్దార్ భావనారాయణ, ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

నున్న(విజయవాడరూరల్): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం నున్న గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో కె.రఘురామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పాల్గొని వరి పంటలో ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వ పెద్దలే నకిలీ మద్యం సూత్రధారులు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- రూ కోట్లు దండుకున్న కూటమి నేతలు
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి



కానూరులో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు

పెనమలూరు: రాష్ట్రంలో నకిలీ మద్యం సూత్రధారులు కూటమి ప్రభుత్వ పెద్దలేనని, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణం రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం చక్రవర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజలే టార్గెట్‌గా నకిలీ మద్యం తయారు చేశారన్నారు. ఏడాదికి రూ.10 వేల కోట్లు టార్గెట్‌గా పెట్టుకోని కూటమి పెద్దల అండదండలతోనే నకిలీ మద్యం రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు చేశారని ఆరోపించారు. నకిలీ మద్యంతో పేదల ఆరోగ్యం ప్రమాదకరంగా మారిందని, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మరణాలకు నకిలీ మద్యం కారణమేనన్నారు. అంగట్లో సరుకుల్లా నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారిందన్నారు. వేల లీటర్ల స్పిరిట్ తీసుకు వచ్చి నకిలీ మద్యం తయారు చేసి కాసులు గడించారని చెప్పారు. కూటమి పెద్దలు నకిలీ మద్యం కేసులో అసలు సూత్రదారులను ప్రజల ముందు నిలబెట్టకుండా కేసు తప్పుదారి పట్టించే పరిస్థితి కనబడుతుందని విమర్శించారు. ప్రతీ రోజు కూటమి నేతలు తాము నీతిపరులమని, పారదర్శక పాలన అందిస్తున్నారని ఊదరగొట్టారని, ఇప్పుడు నకిలీ మద్యం పై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంలో కూటమి పెద్దలందరికీ వాటాలు ఉన్నాయని ప్రజల్లో చర్చ జరుగుతుందని, ప్రశ్నిస్తానని చెప్పే నేత కూడా మాట్లాడక పోవటంపై అనుమానం బలపడుతుందన్నారు. రాష్ట్రంలో మద్యం షాపుల్లో విక్రయిస్తున్న మద్యంపై ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతుందని, రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు.

ప్రజలకు సమాధానం చెప్పాలి..

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణం రాజీనామా చేయాలని దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కొల్లు రవీంద్ర తాను చాలా నీతిమంతుడని చెప్పుకోవటం కాదని, నకిలీ మద్యం పై ప్రజలకు సమాధానం చెప్పాని డిమాండ్ చేశారు. గతంలో బియ్యం కేసులో సంబంధం లేని పేర్ని నానిపై అవాకులు, చవాకులు పేలిన కొల్లు రవీంద్ర నకిలీ మద్యం వ్యవహారంపై బాధ్యతవహించి తన పదవికి రాజీనామా చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కంకిపాడు జెడ్పీటీసీ బాకీబాబు, నేతలు పి.రాఘవరావు, షేక్.అష్రఫ్ అహ్మద్, వేమూరి బాలకృష్ణ, బీమవరపు కోటిరెడ్డి, మండూరు కోటేశ్వరరావు, కాసాని ఫణీంద్ర, కత్తెర బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న విద్యార్థినులు

గన్నవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బాలుర విభాగంలో బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. తొలుత ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.సునీల ప్రారంభించారు. బాల, బాలికల విభాగాల్లో గురువారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడా సమన్వయకర్త డి.నాగరాజు తెలిపారు. పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ముగిసిన పోటీలు

మండల కేంద్రమైన ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాల, బాలికలు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం సీహెచ్.అనిత తెలిపారు.

రెండో రోజున బాలికల ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ఉత్సాహభరితంగా సాగాయి. రెండో రోజున అండర్ - 14, 17 కేటగిరిల్లో బాలికల జట్లకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారిణిలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు హాజరయ్యారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో క్రీడా సందడి నెలకొంది. బాలికల జట్ల మధ్య కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. క్రీడా పోటీలను మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి బీఎస్ రామచంద్రుడు, వ్యాయామోపాధ్యాయులు గుత్తా కృష్ణకుమారి, పామర్తి వెంకటేశ్వరరావు, రామారావు, మహబూబ్, శ్రీనివాస్, ప్రవీణ్ ఖన్నా, రాజేశ్వరి, భాగ్యరాజు, బలరామ్, స్వామి నిర్వహించారు.

అంతర కళాశాలల పురుషుల కబడ్డీ విజేత విజయ కాలేజీ



నున్న(విజయవాడరూరల్): మైలవరం డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో నున్న గ్రామంలోని కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల పురుషుల జట్టు విజేతగా నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. కళాశాలలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న శ్యామ్, సాయి, వెంకటేశ్వర్లు అనే విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ పురుషుల జట్టుకు ఎంపికయ్యారన్నారు. విజయ బీపీఈడీ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకుడు జి.విజయ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు అందజేత

కంకిపాడు: పారిశుద్ధ్య సిబ్బందికి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, ప్రథమ చికిత్స కిట్లు బుధవారం అందజేశారు. సర్పంచ్ ఇందిర మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం సీజేపై దాడికి ఖండన

కంకిపాడు: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజు మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై మతపరమైన దాడులు జరగటం ప్రమాదకరమన్నారు. మతం పేరుతో దేశంలో అరాచకం రాజ్యమేలుతుందని చెప్పారు. న్యాయమూర్తిపై దాడికి దిగిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమాజాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



పోరంకిలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: సమాజాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దాత అనుమోలు ప్రభాకరరావు సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులను కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకవచ్చిన పీ-4 కార్యక్రమంలో దాతలు తమ వంతు భాగస్వాములు కావాలన్నారు. అందరూ సమాజ సేవపై దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. దేశంలో ఇప్పుడు అగ్రస్థానంలో ఉన్న పారిశ్రామిక వేత్తలు గతంలో సాధారణస్థితి నుంచి కృషి, పట్టుదలతో పారిశ్రామికవేత్తలుగా ఎదిగారన్నారు. పోరంకి పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన అనుమోలు ప్రభాకరరావును కలెక్టర్ బాలాజీ అభినందనలు తెలిపారు.

విద్యార్థులు చదువులో రాణించాలి..

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి దాత రూ 15 లక్షలు ఇవ్వటంపై అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు సద్వినియోగం చేసుకోని చదువులో రాణించాలని సూచించారు. కలెక్టర్ బాలాజీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. దాత అనుమోలు ప్రభాకరరావు, ఆర్డీవో హేలాషారోన్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎండీపీవో బండి ప్రణవి, ఎంఈవోలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, హెచ్ఎం సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే లక్ష్యంతో విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఆ పరీక్ష జిల్లా కో ఆర్డినేటర్ పి.జగతి తెలిపారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయను బుధవారం ఆమె సందర్శించారు. ఇప్పటి వరకు జిల్లాలో 440 మంది విద్యార్థులు వీవీఎం సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. 6 నుంచి 11వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ దశల్లో టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహించబడుతుందని, జాతీయ స్థాయిలో విజేతలుగా నిల్చిన విద్యార్థులకు ఉపకారవేతనంతో పాటుగా పలు జాతీయ పరిశోధన సంస్థల్లో పర్యటించేందుకు అవకాశం కల్పించనున్నట్లు జగతి వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

విద్యుత్ వాహనాలతో ఉద్యోగ అవకాశాలు



పెనమలూరు: గ్లోబల్ మార్కెట్‌లో విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్నందున ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి అన్నారు. కాలేజీలో బుధవారం హ్యాండ్స్ ఆన్ ఎలక్ట్రికల్ వెహికల్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు పరిశ్రమల్లో జరుగుతున్న నూతన మార్పులకు అనుగుణంగా నైపుణ్యం సాధించాలన్నారు. ఈవీ రంగం వేగంగా అభివృద్ధి చెందటంతో పరిశోధనలు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు నియాన్ మహేంద్ర నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ పి.గురువులునాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి పాలలో వ్యాధి నిరోధకశక్తి అధికం



పెనమలూరు: తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలని ఏఎన్ఎం వై.రమా తెలిపారు. వణుకూరు గ్రామంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా తల్లి పాలు, హ్యాండ్ వాష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రపాలు ఇస్తే బిడ్డకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలలు తల్లి పాలు ఇవ్వాలని, ఇతర ద్రవాలు ఇవ్వకూడదన్నారు. ఆరు నెలు నిండిన చిన్నారికి ఆహారంతో పాటు తల్లి పాలు కూడా ఇవ్వాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, క్రమం తప్పకుండా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● సీఎన్‌జీ కొరతతో ఆటోవాలాల ఇక్కట్లు



కంకిపాడు పెట్రోల్ బంకు వద్ద క్యూ కట్టిన ఆటోలు

సీఎన్‌జీ గ్యాస్ కొరతతో ఆటోవాలాలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం కంకిపాడు పరిసరాల్లోని పెట్రోలు బంకుల్లో ఎక్కడా సీఎన్‌జీ గ్యాస్ లేదు. దీంతో కంకిపాడు పట్టణంలోని మసీదు సెంటరులో సీఎన్‌జీ గ్యాస్ ఉన్న పెట్రోలు బంకుకు ఆటో వాలాలు క్యూ కట్టారు. గంటల కొద్దీ నిరీక్షించి గ్యాస్ నింపుకుని వెళ్లారు. ఆటో డ్రైవర్ల ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు స్పందించి గ్యాస్ కొరతను పరిష్కరించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

– కంకిపాడు